చెత్త సరే.. సంపదేదీ?

- ఊడ్చే వారు లేరు
- కేంద్రాలకు చేరని చెత్త
- మూలనపడ్డ సైకిల్ రిక్షాలు
- పల్లెల్లో కనిపించని డస్ట్ బిన్లు



కుణుతూరులో వృథాగా చెత్త సంపద తయారీ కేంద్రం

ధర్మవరం రూరల్: చెత్త సంపద తయారీ కేంద్రాలు లక్ష్య సాధనలో వెనకబడ్డాయి. చెత్త నుంచి సంపద సృష్టించడం దేవుడెరుగు.. వీధుల్లో చెత్త ఊడ్చేవారే లేరంటున్నారు ప్రజలు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలు అవుతున్నా చెత్త సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోవడం లేదు. దీంతో కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారిపోతున్నాయి. ధర్మవరం నియోజకవర్గంలో పంచాయతీకి ఒకటి చొప్పున చెత్తతో సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఒక్కొక్క పంచాయతీలో రూ.2.50 లక్షలు, పెద్ద పంచాయతీల్లో అయితే రూ.4.50 లక్షలు, గ్రేడ్ 1, 2 పంచాయతీల్లో రూ.6 లక్షల వ్యయంతో ఉపాధి హామీ పథకం నిధులతో వీటిని నిర్మించారు. నియోజకవర్గంలో గొట్లూరు పంచాయతీలో మోడల్ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించి.. ఇక్కడ ఉమ్మడి జిల్లా పంచాయతీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తుంటారు.

ఎక్కడి చెత్త అక్కడే



పోతుకుంటలో వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్త నుంచి సంపదతో పాటు వీటిలో వర్మీ కంపోస్టు తయారీపై కూడా అధికారులు తొలుత దృష్టి పెట్టారు. ప్రస్తుతం వీటిపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా పంచాయతీ స్థలాలున్న చోట్ల కాంట్రాక్టర్లు నిధులు దోచుకునేందుకు వీటిని నిర్మించి వదిలేశారు. ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోందని గ్రామీణ ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా వీధుల్లోని చెత్తను శుభ్రం చేయకపోవడంతో ఆ చెత్తాచెదారం కాల్వల్లోకి చేరి మురుగు ముందుకు పోకుండా నిలబడిపోయి దుర్వాసన వస్తోందని పోతుకుంటవాసులు తెలిపారు.



గొట్లూరులో మూలనపడిన చెత్తను తరలించే రిక్షాలు

డస్ట్‌బిన్లు ఎక్కడ?

చెత్త సంపద కేంద్రాలు నిర్మించి.. ఇళ్లలో చెత్తను వేయడం కోసం ప్రతి ఇంటికీ రెండు డస్ట్‌బిన్లు చొప్పున అందజేయాలని పంచాయతీలకు సరఫరా చేశారు. ఇక్కడ వరకూ బాగానే ఉన్నా క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యం మూలాన ప్రజలకు అందాల్సిన డస్ట్‌బిన్లు ఇప్పటి వరకు చాలా పంచాయతీల్లో అందించలేదు. దీంతో లక్ష్యం చెత్తపాలవుతోంది.

ధర్మవరం నియోజకవర్గంలో పంచాయతీలు

మండలం	పంచాయతీల సంఖ్య
ధర్మవరం	18
బత్తలపల్లి	13
తాడిమర్రి	14
ముదిగుబ్బ	25

దిష్టిబొమ్మలా మారిన కేంద్రాలు

రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు గ్రామాల్లో దిష్టిబొమ్మలుగా మిగిలాయి. గ్రామాల్లో చెత్తను ఊడ్చి ఈ కేంద్రాలకు తరలించాల్సి ఉంది. జీతాలు సరిగా ఇవ్వలేదని చెత్తను ఊడ్చేవారు లేరు. అధికారులు ప్రత్యేక దృష్టిని సారించకపోతే ఇలాంటివి ఎన్ని కట్టినా ప్రయోజనం ఉండదు. – వెంకటరెడ్డి, కుణుతూరు

వినియోగంలోకి తెస్తాం

గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్ద పీట వేయడానికి చర్యలు తీసుకుంటాం. ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి వాటిని రిక్షాల ద్వారా చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తాం. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి, వాటి ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం. – సాయి మనోహర్, ఎంపీడీఓ, ధర్మవరం

ధర్మవరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుందాం

ధర్మవరం అర్బన్: ఇంటింటా మొక్కలు నాటి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుందామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ప్రజలతో కలిసి మంత్రి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందిరానగర్ హరిజనవాడలోని రోడ్లను మంత్రితోపాటు ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, నాయకులు చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు.

పుట్టపర్తి టౌన్: స్వచ్ఛతలో పుట్టపర్తిని అగ్రస్థానంలో నిలుపుదామని ఎమ్మెల్యే సింధూరారెడ్డి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పరిసరాలు శుభ్రం చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కమిషనర్ ప్రహ్లాద పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి, కదిరికుంట్లపల్లిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛతపై ర్యాలీ చేపట్టారు. ఎంపీడీఓ పోలప్ప, కార్యదర్శి శంకర్‌నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని నినాదాలు చేశారు. సీఐ వి.నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ గోపి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బందితో కలిసి ఆయన స్టేషన్ ప్రాంగణంలోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించారు.

పుట్టపర్తి: బుక్కపట్నంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి చక్రపాణి, ఫారెస్ట్ రేంజర్ యామిని సరస్వతితో కలిసి ప్రజలకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అలాగే తేరు కూడలిలో తహసీల్దార్ షాబుద్దీన్, సర్పంచ్ నాగలక్ష్మి, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సత్యసాయి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి సత్యకుమార్

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మామిళ్లపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థులతో కలసి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం కలిగే అనార్థాలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంఈఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి సుధాకరరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో శనివారం ఎస్‌ఐ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి శుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు.

ఎన్‌పీకుంట: ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా నిషేధిద్దామని ఈఓపీఆర్డీ మాధవరెడ్డి ప్రజలకు సూచించారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పంచాయతీల్లో శనివారం గ్రామసభలు, ర్యాలీలు నిర్వహించారు.

నల్లచెరువు: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘునాథ గుప్త, తహసీల్దార్ రవి నాయక్, ఈఓఆర్డీ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ తిరుపాల్ నాయక్, డాక్టర్ కల్పన రెడ్డి, సర్పంచులు విష్ణు, స్వర్ణలత, ఆంజనమ్మ, గంగాదేవి స్వచ్ఛ భరత్ రీసోర్స్ కో.ఆర్డినేటర్ విశ్వేశ్వర, పంచాయతీ కార్యదర్శి నరేష్, విజయ్ పాల్గొన్నారు.



చెత్త ఊడుస్తున్న జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ

పుట్టపర్తి అర్బన్: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పెడపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు, సర్పంచ్ మంగ్లీబాయి ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్రటరీ గోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం చెన్నక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టరేట్‌లో జేసీ, డీఆర్‌ఓ విజయసారథి ఉద్యోగులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఏఓ వెంకటనారాయణ ఉన్నారు.

తలుపుల : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ రామానాయక్, ఈఓఆర్డీ నసీమా ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. సర్పంచ్ శ్రీలత, ఉప సర్పంచ్ డీకేబాబు, సెక్రటరీ అనీల్, వైద్యాధికారులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు: సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఈ నెల 17 వరకు హాజరు పట్టికలో సంతకాలు చేసి ఉండడంతో ప్రిన్సిపాల్ సుస్మిత జ్యోత్స్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది హాజరు పట్టికలో ఏ రోజుకా రోజు సంతకాలు చేయాలని, రెండు రోజులకు ముందుగానే సోమవారం వరకు ఎలా చేస్తారని ప్రశ్నించారు. నైట్ డ్యూటీకి ఏడుగురు విధులకు హాజరుకావాల్సి ఉన్నా కేవలం ముగ్గురు హాజరుకావడంతో ఇలాగేనా బాలికలకు భద్రత కల్పించేదని మండిపడ్డారు. పాఠశాల కాంపౌండ్‌కు ఎలక్ట్రీకల్ ఫెన్సింగ్ వేయించాలన్నారు. అంతకుముందు కోటపల్లి రోడ్డు నుంచి మబ్బువారిపల్లిలోకి నూతనంగా వేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు.

వ్యక్తిపై కేసు నమోదు

కదిరి టౌన్: పట్టణానికి చెందిన పసుపులేటి రమేష్‌పై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. రమేష్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్‌పై ఆ పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినేలా సోషల్ మీడియాలో కంటెంట్‌ను వైరల్ చేసినట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కదిరప్ప శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వైభవంగా కాటికోటేశ్వర బ్రహ్మోత్సవాలు



క్షేత్రంలో నుంచి ముష్టూరుకు వెళ్తున్న కాటమయ్యస్వామి ప్రభ(ఇన్‌సెట్‌లో) కాటికోటేశ్వరుడు

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలో వెలసిన కాటికోటేశ్వర క్షేత్రంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం పరుష ఘనంగా నిర్వహించారు. భక్తులు తమ మొక్కుల్లో భాగంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి కొండచుట్టూ ప్రదక్షిణలు చేశారు. బియ్యం, ఇతరత్రా వస్తువులు కానుకలుగా సమర్పించుకున్నారు. క్షేత్రంలో వెలసిన వివిధ భాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి, నారికేళాలను సమర్పించారు. అన్నదాన సత్రంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం సాయంత్రం 7 గంటలకు స్వామి మూలస్థానమైన ఈదుల ముష్టూరుకు ప్రభను క్షేత్రం నుంచి తరలించారు. ముష్టూరులో ప్రభ ఊరేగింపు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భారీ ఎత్తున వెలిసిన తినుబండారాలు, ఆట వస్తువులు, చెరుకులు, గాజుల అంగళ్లు కొనుగోలుదారులతో కిటికిటలాడాయి. ఈసందర్భంగా దొంగలు తమ పనితనం ప్రదర్శించడంతో ధర్మవరం రూరల్ సీఐ, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో వారిని పట్టుకుని బుద్ధిచెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి, ముష్టూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేణుక తదితరులు పాల్గొన్నారు.



కాటికోటేశ్వర క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ముదిరిన ప్రొటోకాల్ వివాదం

- మండల మీట్‌కు గైర్హాజరైన ప్రజాప్రతినిధులు
- సమావేశం నేటికి వాయిదా

నల్లచెరువు: మండలంలో స్థానిక ప్రజాప్రతినిధులకు సంబంధించి ప్రొటోకాల్ వివాదం ముదిరింది. అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ గుప్తా అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రమణారెడ్డి తో పాటూ మిగిలిన ఎనిమిది మంది ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీటీసీలుగా ఎన్నికైన తమకు మండల, ఉన్నతాధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఆయా గ్రామాల్లోని కూటమి నాయకులతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడంతో సమావేశాన్ని బాయ్‌కాట్ చేసినట్లు ఎంపీటీసీలు తెలిపారు. ఎంపీటీసీలు గైర్హాజరుతో కోరం లేకపోవడంతో సమావేశం ఆదివారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ రవినాయక్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఘునాథగుప్తా

హత్యాయత్నంపై కేసు నమోదు

తనకల్లు: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డుపై వలి అనే వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపి శనివారం తెలిపారు. నల్లచెరువు మండలం మల్లిరెడ్డిపల్లికి చెందిన వలి రెండో కుమారుడైన ఇర్షాద్ బెంగుళూరులో మాబు, సబీల దంపతుల కుమార్తె నెలరోజుల కిందట అపహరించుకుపోయాడు. దీనిపై అక్కడ పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్ కేసు నమోదైంది. దీంతో తమ కుమార్తె ఎక్కడ ఉందో చెప్పాలని, లేకుంటే నిన్ను చంపుతామని తరచూ ఫోన్‌లో వలిని బెదిరించేవారు. ఈక్రమంలో శుక్రవారం రెండు బైక్‌లపై ముసుగులు ధరించి వచ్చిన నలుగురు వ్యక్తులు వలిపై కత్తితో దాడి చేసి అక్కడి నుండి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మాబు దంపతులతో పాటు దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని వినతి

ముదిగుబ్బ: మండల కేంద్రలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు శనివారం స్థానిక యువకులు వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువకులు బాబ్ జాన్, ఠాగూర్, బాబావలి, ప్రకాష్, ఇమాం, దాదాపీర్, వంశీ, షెక్షా, మధు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇష్టంతో చదవండి



విద్యార్థులకు పంపిణీ చేసిన పరీక్ష సామగ్రి

బత్తలపల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో మేధాశక్తి, పట్టుదల ఉంటుందని దానిని సద్వినియోగం చేసుకొని ఇష్టంతో చదివి ఉత్తీర్ణత సాధించాలని రామాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటనాయుడు పేర్కొన్నారు. శనివారం రామాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. సాంస్కృతి కార్యక్రమాలను ఆహుతులను ఆకట్టుకున్నాయి. పరీక్ష సామగ్రిని పరిటాల యూత్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు శ్రీరాములు, రవీంద్ర, గంగిరెడ్డి, చంద్రశేఖర్, వరదరాజులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

కదిరి అర్బన్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఆప్కాస్ వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ ఈ నెల 19న విజయవాడలో తలపెట్టిన ధర్నా జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. శనివారం వారు స్థానిక బీసీ హాస్టల్‌కు చేరుకుని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కరపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆప్కాస్ వ్యవస్థను రద్దు చేసి ఏజన్సీ వ్యవస్థను తీసుకొస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. ఆప్కాస్ వ్యవస్థను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు.

మసీదుకు ఆర్థికసాయం

కదిరి అర్బన్: గాండ్లపెంట మండలం కమతంపల్లి మసీదుకు శనివారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ మొత్తాన్ని మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి, ఫక్రొద్దీన్, ఇస్మాయిల్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.


వేసవిలో జాగ్రత్తలు తీసుకోండి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్

చెన్నేకొత్తపల్లి: వేసవిలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వియా సాల్మన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని చిన్నంపేట గ్రామంలో ఎన్‌ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాన్ని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ సెల్వియా సాల్మన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో గర్భవతులు, బీపీ, షుగర్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ పద్మావతి, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ ఏఎన్‌ఎం అశ్విని, ఆశావర్కర్ బాలమ్మ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామంలో కియా కంపెనీ వారి సహకారంతో ప్రభాత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు 145 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. సొసైటీ సెక్రటరీ ప్రభాకర్, డాక్టర్ బషీర్, అకౌంటెంట్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ మరళీకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ



గొడుగు అందిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వివిధ కూడళ్లలో పని చేస్తున్న చర్మకారులకు గొడుగులు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు మూడే రవినాయక్ తెలిపారు. విద్యుత్ డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీర్ అమృత సహకారంతో ఏడు గొడుగులు అందించామన్నారు. ఈసందర్భంగా చర్మకారులు రవినాయక్, దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామికి పూజలు



అలంకరణలో లక్ష్మీ నరసింహుడు

కనగానపల్లి: మామిళ్లపల్లి గ్రామంలో శనివారం అహోబిల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని స్వామి కాపులు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీవాసుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద దోసంగాలు కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామికి జలధిపూజ నిర్వహించి లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు.

కదిరి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి సమీపంలో ఉన్న కదిరికొండ చుట్టూ గిరి ప్రదక్షిణ ఉత్సవం ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రముఖ న్యాయవాది సుబ్బరాజు గుప్తా తెలిపారు. శనివారం వారు కదిరి కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. కదిరి కొండ చుట్టూ దాదాపు 7 కిలోమీటర్లు రహదారి ఏర్పాటు సాధ్యాసాధ్యాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో చర్చించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వేతనాలు పెంచాలని వినతి

గాండ్లపెంట: వేతనాలు పెంచాలని కోరుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికులు శనివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి బాషాకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనాలు అందించాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, బీమా తదితర వాటిని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు అక్కులప్ప, నరసింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్: హోలీ పండుగ రోజున పట్టణంలోని అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్ వెంకటపతిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ ,ఏఐఎస్ఎఫ్ నాయకులు బాబ్జాన్, మహేంద్ర డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ రోజున విద్యార్థులను భౌతికంగా తాకడం ఎంతవరకు వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా కళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే పీఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌పీ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అరుణ్‌కుమార్, నరసింహ, ఉపేంద్ర తదితరులు ప్రిన్సిపాల్ వెంకటపతిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చేనేతల ధర్నా జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: చేనేత కార్మికులకు బడ్జెట్‌లో జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ ఈ నెల 17న ఆర్డీఓ, కలెక్టరేట్ల వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని చేనేత సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పోలా లక్ష్మినారాయణ, జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటస్వామి, లక్ష్మీనారాయణ శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికులకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు ప్రభుత్వం కేటాయించాలన్నారు. ఎన్నికల్లో చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గత ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయిస్తే అంతకన్నా మెరుగ్గా బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం రూ.138 కోట్లు మాత్రమే కేటాయించి చేనేతలను దగా చేసిందన్నారు. ధర్నాలకు చేనేతలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రంగయ్య, సిరివెన్నెల దేవేంద్ర, శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.